క్లుప్తంగా

క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలి



పరిచయం చేసుకుంటున్న క్రీడాకారులు

కెరమెరి: యువత క్రీడలతో పాటు చదువుల్లోనూ రాణించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ అన్నారు. శుక్రవారం సిర్పూర్(యూ) మండలంలోని నేట్నూర్ గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, గ్రామ పటేల్ జ్యోతిరాం, ఆత్రం దేవ్‌రావు, ఎంపీటీసీ పార్వతీబాయి, నాయకులు గేడాం శంభు, కోట్నాక దౌలత్‌రావు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు ఎవరైనా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏఈ ఫిరోజ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని, విద్యుత్ బిల్లుల వసూలు కోసం స్పెషల్‌డ్రైవ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. బిల్లులు సకాలంలో చెల్లించని వారి కనెక్షన్లను తొలగిస్తున్నామని, సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలర్లు సునీల్, ఎల్లేష్‌లు అన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3లక్షల 84వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పలువార్డుల్లో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్యచికిత్సలను ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైచందర్, మధన్, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చండి



వినతిపత్రం అందజేస్తున్న నిషాని గ్రామస్తులు

కెరమెరి: మండలంలోని నిషాని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని, ఆంజనేయ స్వామి ఆలయానికి నిధులు మంజూరు చేయాలని, బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతుల కోసం ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు. నాయకులు జంగు, శంకర్, అన్నాజి తదితరులు ఉన్నారు.

పాఠశాలలు తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారి హన్మంతు

కౌటాల: మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల నోడల్ అధికారి హన్మంతు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యం పెంచాలన్నారు. రాయడం, చదవడం తప్పనిసరిగా వచ్చేలా విద్యార్థులపై శ్రద్ధ ఉంచాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ దేవన్న, తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

పెంచికల్‌పేట్: హైదరాబాద్ నగరంలోని తెలంగాణ భవన్‌లో ఈనెల 29వ తేదీన నిర్వహించే సీఆర్పీల రాష్ట్ర దశాబ్ది మహాసభకు సీఆర్పీలు (క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్) తరలిరావాలని జిల్లా నాయకులు డి. పవన్‌కుమార్, డి. శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో కోరారు. సమస్యల సాధనకు జిల్లాలో పనిచేస్తున్న సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న సీఆర్పీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రుణమాఫీ జరిగేనా..?

- ఎదురుచూస్తున్న రైతులు
- రూ.25వేల వరకు మాత్రమే మాఫీ
- బ్యాంకుల్లో పెరిగిపోతున్న వడ్డీ
- కొత్త రుణాలు ఇవ్వని బ్యాంకర్లు



పొలం దున్నుతున్న రైతులు (ఫైల్)

బెజ్జూర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ హామీ నెరవేరుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు రూ.లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు కేవలం రూ.25వేల వరకు మాత్రమే మాఫీ చేసింది. నాలుగు వాయిదాల్లో రుణమాఫీ చేస్తామని గతంలో ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో హామీ నీటిమూటలుగానే మారుతోంది.

నిరాశలో రైతన్నలు..

ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతన్నలు నిరాశ చెందుతున్నారు. మొదటి విడత రూ.25వేలు మాత్రమే రుణమాఫీ చేయగా అది కూడా కొంత మంది రైతులకు మాత్రమే వర్తించింది. మిగితా రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సర్కారు రుణమాఫీ చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. రూ.లక్ష లోపు పంట రుణాలన్నింటిని మాఫీ చేస్తామని ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు అమలుకు నోచుకోవడం లేదు.

రుణమాఫీ సొమ్ము వడ్డీకే సరి..

ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో ఇదివరకు రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీ భారం తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వం బ్యాంక్ రుణాలను మాఫీ చేస్తుందన్న నమ్మకంతో చాలా మంది రైతులు బ్యాంకుల వైపు కన్నెత్తి చూడటం లేదు. రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంక్ అధికారులు చెబుతున్నా రైతులు పెడచెవిన పెడుతున్నారు. రుణమాఫీ అవుతుందనే ధీమాతో రుణాలను సైతం చెల్లించకపోవడంతో ఇప్పుడు వడ్డీ, అసలు కలిపి రెండింతలయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకవేళ ప్రభుత్వం రుణమాఫీ చేసినా వచ్చిన సొమ్ము వడ్డీకే సరిపోయే దుస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతుబంధు పథకం కింద అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నా బ్యాంకర్లు మాత్రం వాటిని రైతులకు ఇవ్వడం లేదు. రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోకపోవడంతో వడ్డీ కింద తీసుకుంటున్నారు.

కొత్త రుణాలు మంజూరు కాక తిప్పలు

జిల్లాలో 68వేల మంది రైతులు అర్హులుగా అధికారులు గుర్తించారు. గతేడాది 7042 మంది రైతులు రూ.25వేల చొప్పున రుణమాఫీ పొందగా, మిగిలిన లక్ష లోపు రుణాలు ఉన్న 61వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంది. పాత రుణాలు చెల్లించకపోవడంతో రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు మంజూరు చేయడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులు వానాకాలం సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం నానా తిప్పలు పడ్డారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తే సమస్యలు ఉండవని రైతులు పేర్కొంటున్నారు. టీజీబీ మేనేజర్ ఆర్.రవిందర్‌రావును సంప్రదించగా రెండో విడతలో మిగిలిన రైతులకు రుణాలు మాఫీ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.

మాఫీ చేయమంటే అప్పులు కట్టుకునే వాళ్లం



రైతులకు లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీంతో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించలేదు. ఒకవేళ మాఫీ చేయలేమని చెబితే అప్పుడే అప్పులు చెల్లించే వాళ్లం. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనే ధీమాతో పంట రుణాలు కట్టలేదు. ఇప్పుడు రుణాల కోసం బ్యాంక్‌కు వెళ్లలేని పరిస్థితి ఉంది.

\- సిడాం రమేష్, గుండేపల్లి, పెంచికల్‌పేట్

రైతుబంధు డబ్బులు ఇవ్వడం లేదు



ప్రభుత్వం రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేసిన డబ్బులను బ్యాంక్ అధికారులు ఇవ్వడం లేదు. బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీ పెరిగిపోతోంది. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలు మాఫీ చేయాలి.

\- పి.నానయ్య, అంబగట్ట

'పత్తి' ఇంటిలో.. ధర పాతాళంలో!

- రోజురోజుకూ తగ్గుతున్న ధర
- ఆందోళన చెందుతున్న రైతులు



లంబాడిహేటిలో నిల్వ ఉంచిన పత్తి

చింతలమానెపల్లి: పత్తి పంట రైతులకు కన్నీళ్లు మిగులుస్తోంది. రోజురోజుకూ తగ్గుతున్న ధర రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇంటిలో నిల్వ ఉంచిన పత్తి పంట అలాగే ఉండగా ధర పాతాళానికి చేరుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా రైతులు పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో 3.50లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఏటా జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

తగ్గుతున్న ధర..

పత్తి పంటకు ఆరంభంలో మంచి ధర వచ్చింది. గత నవంబర్‌లో పత్తి క్వింటాలుకు రూ.9400 మద్దతు ధర ప్రకటించారు. డిసెంబర్‌లో కొనసాగిన ధర ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. ఈక్రమంలో ప్రస్తుతం పత్తి ధర క్వింటాలుకు రూ. 7600 పలుకుతోంది. సిర్పూర్ నియోజకవర్గంలోని సిర్పూర్ జిన్నింగ్ మిల్లులో పత్తి ధర క్వింటాలుకు రూ. 7850 ఉండగా కిరాయి రూ. 100, హమాలీ రూ. 110, మిల్లులో హమాలీ రూ. 20లు పోగా రైతుకు రూ. 7620 చెల్లిస్తున్నారు. కౌటాల మిల్లులో క్వింటాలుకు రూ.7650 ధర ఉండగా ఖర్చులు పోను రూ.7420 చెల్లిస్తున్నారు. పత్తి నాణ్యతను అనుసరించి ధరల్లో మార్పులు ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి రోజుకు రూ. 100 చొప్పున పత్తి ధర తగ్గుతూ వస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం..

పత్తి ధరలపై అంతర్జాతీయంగా మార్కెట్‌లో ఉన్న పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయని పత్తి వ్యాపారులు పేర్కొంటున్నారు. గత ఏడాది పత్తి నిల్వలు ఎక్కువగా ఉండడంతో స్పిన్నింగ్ మిల్లుల నుంచి ఎగుమతులు మందగించాయని ఈక్రమంలో దేశీయంగా ధరలు తగ్గుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది దిగుబడుల కంటే ఈఏడాది పత్తి దిగుబడి ఎక్కువ లేకున్నా ధరలు తక్కువగా ఉండడం రైతుల్లో ఆందోళనకు కారణమవుతోంది. స్పిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు తగ్గడంతో నష్టాలు రాకుండా జిల్లాలోని పలు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు నిలిపి వేస్తున్నారని సమాచారం.

ఇళ్లల్లోనే పత్తి..

పత్తి ధరలు పెరుగుతాయనే ఆశతో రైతులు పత్తి పంటను ఇంటిలోనే నిల్వ ఉంచుతున్నారు. గత నవంబర్‌లో ప్రకటించిన ధర తిరిగి వస్తుందనే ఆశాభావం రైతుల్లో ఉండేది. అయితే రోజురోజుకు తగ్గుతున్న ధరలతో నెల రోజులుగా ఇళ్లల్లో నిల్వ ఉంచిన పత్తిని నష్టానికే అమ్ముకోవాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటిలోనే నిల్వ చేశాం

పత్తి ధర పెరుగుతుందనే ఆశతో ఇంటిలోనే పత్తి నిల్వ చేశాం. గత కొన్ని రోజులుగా ధరలు తగ్గుతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్నాం. ప్రస్తుతం ఉన్న ధరకు పంట అమ్ముకుంటే నష్టం తప్పదు.

\- లావుడె భీములు, చింతలమానెపల్లి

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పత్తి ధరలను పెంచి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తగ్గుతున్న ధరలతో రైతులు చాలా నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రైతులను ఆదుకునేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపాలి.

\- లావుడె రాము, చింతలమానెపల్లి

జాతర నిర్వహణకు సింగరేణి తోడ్పడాలి



వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ వెంకటేశం చారి

రెబ్బెన: జిల్లాలో సుప్రసిద్ధ గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే జాతర ఏర్పాట్లకు సింగరేణి తమ తోడ్పాటు అందించాలని ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం చారి కోరారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరగబోయే జాతరకు జిల్లాతో పాటు పలు జిల్లాలకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. జాతరలో భక్తుల కోసం అవసరమైన లైటింగ్ సౌకర్యంతో పాటు మంచినీటి సరఫరా, స్నానాల చిరుజల్లు, వాటర్ షెడ్లను సింగరేణి ఆధ్వర్యంలో కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరగబోయే జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రెబ్బెన సీఐ అల్లం నరేందర్ అన్నారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు కల్పించే సౌకర్యాలపై ఈవో బాపిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మదునయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం



దేవార దంపతులను సన్మానిస్తున్న టీచర్లు



ఎంపీవోను సన్మానిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: ఉత్తమ సేవలకు గణతంత్ర దినోత్సవ పురస్కారం అందుకున్న ఎంపీవో ప్రసాద్‌ను ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మల్లికార్జున్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు నిరంతరం సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, సర్పంచ్ భీమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉత్తమ' సేవకుడికి సన్మానం

రెబ్బెన: దేవార వినోద్ యువసేన ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందుకున్న యువసేన వ్యవస్థాపకుడు దేవార వినోద్ -వీణ దంపతులను శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో నిరుపేదలకు, నిత్యవసర సరుకులు, కూరగాయలు, అన్నదానాలు, ప్రతి వేసవిలో 3నెలల పాటు ఉచితంగా అంబలి పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. సూపర్‌వైజర్ కళావతి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'పరీక్ష పై చర్చ' వీక్షణ

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్: ప్రధాని నరేంద్ర మోడీ పరీక్షపై చర్చ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగాన్ని కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పట్టణంలోని వివిధ పాఠశాలల్లో, కాగజ్‌నగర్ మండలంలోని భట్‌పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి శుక్రవారం వీక్షించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

కౌటాల: మండల కేంద్రంలో శుక్రవారం ఎలక్ట్రీషియన్ డే వేడుకలు నిర్వహించారు. ఎలక్ట్రీషియన్ కమిటీ సభ్యులు జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిసన్ 1880 జనవరి 27న విద్యుత్ బల్బ్ కనుగొన్న సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మండల అధ్యక్షుడు శంకర్, సభ్యులు వెంకటేశ్, అంజయ్య, పితాంబర్, సతీష్, విశ్వనాథ్, శ్రీనివాస్, శ్రావణ్, దమ్మపాల్, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్ ఆదే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో జీపీ లెవల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాపోటీలు నిర్వహించాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని తెలిపారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, నాయకులు దోని రవి, నాందేవ్, సుకృజీ, నిర్వాహకులు రవితేజ, లోహిత్, వెంకటేశ్, నరేష్ పాల్గొన్నారు.

మహర్ కులసంఘం కమిటీ ఎన్నిక

బెజ్జూర్: మండల కేంద్రంలోని బుద్ధ విహార్ భవనంలో శుక్రవారం తాలూకా అధ్యక్షుడు బసవకారు విశ్వనాథ్ ఆధ్వర్యంలో బెజ్జూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాళ్ల రామయ్య, అధ్యక్షుడిగా కుమ్మరి పోషన్న, ఉపాధ్యక్షులుగా భీమయ్య, లక్ష్మణ్, దిగంబర్, నారాయణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటి, సంయుక్త కార్యదర్శులుగా దుర్గయ్య, తిరుపతి, రాందాస్, ఎల్లయ్య, కోశాధికారిగా శంకరయ్య, ప్రచార కార్యదర్శులుగా లింగయ్య, ప్రేమ్ కుమార్, రామ్‌టెంకి తిరుపతి, బోరుకుట్ ప్రేమ్ సాగర్, సలహాదారులుగా శంకర్, రవి, శంకర్, తిరుపతి, లింగయ్య, దేవాది, లింగయ్య, ప్రేమ్, రాజారాం, జోగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా ఉపాధ్యక్షుడు దేవాది, తాలూక ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావు, దేవాజి, శంకర్, మల్లయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న దంపతులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆరవరోజు ఆలయంలో మహిళలచే సామూహిక లలితాసహస్ర పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులచే చండీ సప్తశతి హోమం, రుద్ర హోమం, రుద్రాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు చందావార్ రవిచంద్ర శర్మ, శ్రావణ్ శర్మ, శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు బాలేశ్వర జాతర

రథసప్తమి వేడుకల్లో భాగంగా బాలేశ్వర ఆలయం సమీపంలోని పెద్దవాగు వద్ద మాఘశుద్ధ సప్తమి శనివారం రోజు జాతర నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

సాయంత్రం బాలేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పెద్దవాగు మీదుగా ఊరేగిస్తారు. జిల్లా కేంద్రంతో పాటు ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, తిర్యాణి, కాగజ్‌నగర్‌కు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు.

భూసమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

నార్నూర్: భూసమస్యల పరిష్కరంలో జాప్యం చేయవద్దని ఆర్డీవో కదం సురేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మండల కేంద్రానికి చెందిన జంగుబాయి అనే గిరిజన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 103, 108 సర్వే నెంబర్‌లో ఉన్న భూములను పరిశీలించారు.

రాజన్న రాజ్యాన్ని స్థాపిద్దాం



జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణలో రాజన్న రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రతీ ఒక్కరు కలిసి రావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ భూక్యా తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని లింగాపూర్ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రియావుద్దీన్‌తో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతులు చిరుధాన్యాలు సాగు చేయాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌటాల: రైతులు చిరుధాన్యాలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిని చిరుధాన్యాల ఏడాదిగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పోరుతు చరందాస్, ఏఈవో చౌదరి అంజన్న, రైతుబంధు సమితి అధ్యక్షుడు ప్రకాష్, పోరేతు పత్రు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. మండలంలోని దిందా గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలున్న వారికి ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు చేస్తుందన్నారు. కళ్లద్దాలు అందించడంతోపాటు శస్త్ర చికిత్సలు చేయిస్తుందని తెలిపారు. ఎంపీడీవో మహేందర్, వైద్యాధికారి రాజ్‌కుమార్, సర్పంచ్ యశోద, నాయకులు వెంకన్న, సోమయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధ నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో ఫిబ్రవరి 2న పలు దేవతల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమ వాల్‌పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ రాజేశం ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారులే వాసుపటేల్, ఓనాజీ, రాజన్న, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.